సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం। 15। అక్టోబర్। 2025



హోరాహోరీగా పోటీలు
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. - IIలో



జీవన విధానం తెలిపే మార్గం
బౌద్ధం.. ఒక మతం కాదని జీవన విధానం తెలిపే దమ్మ మార్గమని ప్రొఫెసర్ మహేష్ దియోకర్ అన్నారు. - IIలో



ట్యాబ్ ఎంట్రీ చేశాకే..
కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ చేశాకే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. - IIIలో

న్యూస్‌రీల్

విద్యాబోధనలో ఇబ్బంది కలగకుండా చూడాలి

భువనగిరిటౌన్ : బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, విద్యాబోధనలో ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంత రావు, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగులందరూ సర్వేలో పాల్గొనాలి

భువనగిరిటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్ – 2047 డాక్యుమెంట్ రూపొందిస్తోందని ఈ సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనాలని కలెక్టర్ హనుమంత రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ విజన్-2047 డాక్యుమెంట్ తయారీలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం పొందేలా సిటిజన్ సర్వే చేపట్టారని పేర్కొన్నారు. ఈనెల 25 వరకు జరిగే సర్వేలో ఉద్యోగులు పాల్గొనడంతోపాటు ఈ సర్వే లింక్ ను, క్యూఆర్‌కోడ్ ను తమ కార్యాలయాల్లో ప్రదర్శించి విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సర్క్యులర్ జారీ చేశారని తెలిపారు. సర్వేలో http://www.telangana.gov.in/telanganarising/ లింక్ ద్వారా పాల్గొనాలని పేర్కొన్నారు.

అవగాహన కల్పించాలి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

బీబీనగర్: రెవెన్యూ చట్టంలోని నూతన విధానాలు, భూ సంస్కరణలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. మంగళవారం బీబీనగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. భూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, డీటీ భగత్ తదితరులున్నారు.

షోకాజ్ నోటీసులు జారీ

బీబీనగర్: భూ సర్వేలకు ఎక్కువ సమయం తీసుకోవడం, సర్వే చేసిన వాటిని కావాలనే తిరస్కరించడంపై ఫిర్యాదులు రావడంతో మండల సర్వేయర్ అనితకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గూడూరు గ్రామంలోని పల్లె దవాఖానాను పరిశీలించేందుకు వెళ్లగా ఆస్పత్రి మూసి ఉండడంతో ఎంఎల్‌హెచ్‌పీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదే విధంగా బీబీనగర్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన పోషణ మాస కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

భువనగిరి: 2025–26 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతిలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు గత ఫిబ్రవరిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు హాజరై ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 15, 16, 17వ తేదీల్లో భువనగిరి పట్టణంలోని బైపాస్ రోడ్డు పక్కన గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

గాలికుంటు నివారణకు నేటి నుంచి టీకాలు

భువనగిరిటౌన్ : పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమానికి పశు సంవర్ధక శాఖ సిద్ధమైంది. బుధవారం నుంచి నవంబర్ 15 వరకు నెల రోజుల పాటు 70శాతం టీకాలు అంటే 1,37,200 డోసులు పశువులకు వేయనున్నారు. 47 ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి 74 పశు వైద్య శాలల పరిధిలో టీకాలు వేయనున్నారు.

పశు వైద్యశాఖ డాక్టర్లతో సమావేశం

భువనగిరిలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ జానయ్య ప్రాంతీయ పశు వైద్యశాఖ డాక్టర్లతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్‌తో కలిసి అధికారికంగా ప్రారంభించేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో టీకాల పంపిణీ ప్రక్రియను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించాలని పేర్కొన్నారు.

గమనించకపోతే ప్రమాదమే..


భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు–రుద్రవెల్లి గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ బ్రిడ్జి రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మూసీ ఉప్పొంగి ప్రవహించడంతో బ్రిడ్జిలోని కొంత భాగం ధ్వంసమైంది. భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్ మండలాల వారు ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు అధికారులు అక్కడ రాళ్లను అడ్డంగా పెట్టారు. రాత్రి వేళల్లో రాళ్లను గమనించకపోతే వాహనదారులు మూసీలో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ధ్వంసమైన జూలూరు, రుద్రవెల్లి బ్రిడ్జి →



డీసీసీ పీఠంపై కసరత్తు

- రేపు భువనగిరికి ఏఐసీసీ పరిశీలకుడి రాక
- 18న ఆలేరులో, 19న భువనగిరిలో పార్టీ కేడర్‌తో సమావేశం
- ఎమ్మెల్యేలు, డీసీసీ కోఆర్డినేటర్లు, పార్టీ ముఖ్యుల నుంచి అభిప్రాయాల సేకరణ
- ఇప్పటికే పరిశీలకులను కలిసేందుకు ప్రయత్నాలు ప్రారంభించిన ఆశావహులు



సాక్షి, యాదాద్రి: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని భర్తీ చేసేందుకు పార్టీ అధిష్టానం సన్నాహాలు చేస్తోంది. ఈమేరకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. ఇందుకోసం ఏఐసీసీతో పాటు టీపీసీసీ నియమించిన పరిశీలకులు ఈనెల 16న జిల్లాకు రానున్నారు. ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో నేతలతో సమావేశమై అభిప్రాయాలను సేకరించనున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశం..

ఏఐసీసీ పరిశీలకుడు శరత్ రావత్ ఈనెల 16న రాత్రి భువనగిరికి చేరుకుని 17న డీసీసీ కార్యాలయంలో కార్యకర్తలు, ముఖ్యనాయకుల నుంచి డీసీసీ నూతన అధ్యక్షుడి నియామకంపై అభిప్రాయ సేకరణ చేయనున్నారు. ఇందుకోసం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి మాట్లాడతారు. మరుసటి రోజు 18న ఉదయం ఆలేరులో, మధ్యాహ్నం యాదగిరిగుట్టలో బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తారు. 19న ఉదయం భువనగిరిలో, మధ్యాహ్నం, బీబీనగర్–పోచంపల్లిలో కార్యకర్త సమావేశం కానున్నారు. 20న మరోసారి భువనగిరి డీసీసీ కార్యాలయంలో పార్టీ కేడర్ నుంచి అభిప్రాయ సేకరణ చేస్తారు.

పార్టీ విధేయులకే పట్టం

పార్టీ విధేయులకే డీసీసీ అధ్యక్షుడి పట్టం కట్టనున్నారు. పార్టీలు మారిన వారికి అవకాశం లేదని చెబుతున్నారు. సీనియర్లకు అవకాశం ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా ఉంది. అయితే ఐదేళ్లకు పైబడి ఇప్పటికే డీసీసీ అధ్యక్షుడిగా ఉన్నవారికి మరోసారి అవకాశం లేదు. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు రెండేళ్ల క్రితం నియామకమయ్యారు. 2023 ఆగస్టులో ఆయన డీసీసీ అధ్యక్షుడు అయ్యారు. అంటే మరోసారి పోటీలో ఉండే అవకాశం ఉంది.

ఆశావహుల సంఖ్య అధికంగానే..

డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఆశావహుల సంఖ్య అధికంగానే ఉంది. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల నుంచి పదవిని ఆశిస్తున్నవారు గాడ్‌ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సామాజికవర్గ సమీకరణలను బేరీజు వేస్తూ తమకు డీసీసీ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే పలువురు ఆశావహులు పరిశీలకులను కలిసే ప్రయత్నాలు ప్రారంభించారు. పార్టీ విధేయులుగా తాము చేసిన కార్యక్రమాల జాబితాను రూపొందించి వారికి ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థుల ఎంపికలో డీసీసీ అధ్యక్షుడి పాత్ర కీలకంగా ఉంటుందని ఇప్పటికే ఏఐసీసీ నుంచి సంకేతాలు ఉన్నాయి. దీంతో పదవికి గట్టిపోటీ ఖాయమంటున్నాయి కాంగ్రెస్ శ్రేణులు.

డీసీసీ అధ్యక్షుడి నియామకంపై సీఎం దృష్టికి..

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, జనగాం ఉపేందర్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడి నియామకంపై చర్చకు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడిని మరోసారి కొనసాగించాలని సీఎం దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఏఐసీసీ పరిశీలకులు, పీసీసీ పరిశీలకులు జిల్లాకు వచ్చి పార్టీ కేడర్ నుంచి అభిప్రాయాలు తీసుకున్న అనంతరం నిర్ణయం ఉంటుందని సీఎం చెప్పినట్లు సమాచారం. సామాజికవర్గ సమీకరణలు కుదరకపోతే నూతన డీసీసీ అధ్యక్షుడు వచ్చే అవకాశం లేకపోలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు సాక్షితో తెలిపారు.

19 రోజులు.. 550 దరఖాస్తులు

- మందకొడిగా సాగుతున్న మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ
- ఇప్పటివరకు కేవలం 550 దరఖాస్తులే
- దరఖాస్తులు సమర్పించేందుకు నాలుగు రోజులే గడువు

భువనగిరి: జిల్లాలో మద్యం దుకాణాల టెండర్లకు ఊహించిన స్థాయిలో స్పందన రావడం లేదు. టెండర్లు వేయడానికి ఇంకా ఐదు రోజులు మాత్రమే ఉంది. మంగళవారం 42 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు కేవలం 550 దరఖాస్తులు వచ్చాయి. గతంలో మద్యం దుకాణానికి టెండర్ వేసేందుకు రూ. 2 లక్షలు వరకు ఉండేది. కానీ ఈసారి ప్రభుత్వం రెండేళ్ల కాలపరిమితితో ఒక్కో దుకాణానికి దరఖాస్తు చేసేందుకు నాన్ రిఫండబుల్ ఫీజు రూ.3లక్షలు చేసింది. టెండర్లు వేయడానికి వెనుకడుగు వేయడం కూడా ఒక కారణంగా చెప్పుకుంటున్నారు.

18వ తేదీ వరకు అవకాశం

జిల్లాలో మొత్తం 82 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి కోసం ఇప్పటి వరకు 550 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. టెండర్లు పిలిచి ఇప్పటి వరకు 19 రోజులు గడుస్తున్న దరఖాస్తులు తక్కువగా రావడం గమనార్హం. 2025–27 సంవత్సరానికి గాను కొత్త లైసెన్స్ కోసం మద్యం దుకాణాల నిర్వహణకు ఎక్సైజ్ శాఖ సెప్టెంబర్ 26 ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 18వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు.

గతేడాది 3,900కుపైగా దరఖాస్తులు

గతేడాది జిల్లాలో మద్యం టెండర్ల కోసం 3900లకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా జిల్లాకు సుమారు రూ.78.50 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది చివరి మూడు రోజుల్లో సుమారు 70 శాతం వరకు టెండర్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ఈ సారి కూడా చివరి మూడు రోజుల్లో దరఖాస్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

చివరి రోజుల్లో పెరిగే అవకాశం ఉంది

ఇప్పటివరకు 82 మద్యం దుకాణాలకు టెండర్ల కోసం 550 దరఖాస్తులు వచ్చాయి. ఇంకా నాలుగు రోజుల సమయం ఉంది. చివరి రోజుల్లో దరఖాస్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండవచ్చు. దరఖాస్తులు అందజేసే వ్యాపారులకు సందేహాలు ఉంటే భువనగిరి సీఐ నరేందర్ 8712658956, రామన్నపేట సీఐ బాలాజీ నాయక్ 8712658958, ఆలేరు సీఐ దీపిక 8712658955, మోత్కూర్ సీఐ రవిచంద్రారెడ్డి 8712658957 నంబర్లను సంప్రదించవచ్చు.

– విష్ణుమూర్తి, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి

నిధుల విడుదల చేయాలని సీఎంను కోరిన ఎమ్మెల్యేలు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. గంధమల్ల రిజర్వాయర్ భూసేకరణకు రూ.50 కోట్లు కావాలని కోరినట్లు బీర్ల ఐలయ్య తెలిపారు. ఈమేరకు నిధులు విడుదల చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మూసీ నదిపై రుద్రవెల్లి–జూలూరు మధ్యన బ్రిడ్జి నిర్మాణానికి హెచ్‌ఎండీఏ నిధులు రూ. 27.50 కోట్లు విడుదల చేస్తానని సీఎం చెప్పారని కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

జీఎస్టీ తగ్గినా.. కొనుగోళ్లు పెరగలే!

ఉమ్మడి జిల్లాలో పుంజుకోని వాహనాల కొనుగోలు

- జీఎస్టీ తగ్గుదలకు ముందు, తరువాత విక్రయాల్లో కనిపించని తేడా
- దసరాకు ముందే బుక్ చేసుకున్న వినియోగదారులు
- ధరలు తగ్గినా కనిపించని ఉత్సాహం



ఉమ్మడి జిల్లాలో వాహన రిజిస్ట్రేషన్లు ఇలా..

జీఎస్టీ తగ్గింపునకు ముందు..

జిల్లా	కార్లు	బైకులు	మిగతావి
యాదాద్రి	81	546	218
నల్లగొండ	64	505	473
సూర్యాపేట	45	386	316

జీఎస్టీ తగ్గింపు తరువాత..

జిల్లా	కార్లు	బైకులు	మిగతావి
యాదాద్రి	54	451	181
నల్లగొండ	60	528	450
సూర్యాపేట	37	345	285

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కేంద్ర ప్రభుత్వం వాహనాలపై జీఎస్టీ తగ్గించినా వాహన కొనుగోలుదారుల్లో పెద్దగా ఉత్సాహం కనిపించలేదు. జీఎస్టీ తగ్గింపు అమల్లోకి వచ్చి 25 రోజులు గడిచినా వాహన కొనుగోళ్లలో పెద్దగా తేడా లేదు. ఉమ్మడి జిల్లాలో జీఎస్టీ తగ్గక ముందు 20 రోజుల్లో కొనుగోలు చేసిన వాహనాల సంఖ్య, జీఎస్టీ తగ్గింపు అమల్లోకి వచ్చిన తరువాత 20 రోజుల్లో జరిగిన వాహన కొనుగోళ్లను పోల్చితే కాస్త తగ్గాయి

28 శాతం నుంచి 18 శాతానికి తగ్గిన జీఎస్టీ

కేంద్ర ప్రభుత్వం వాహనాలపై ఉన్న జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. దీంతో దసరాకు పెద్ద ఎత్తున వాహనాలు కొనుగోలు చేస్తారని అంతా భావించారు. కార్ల కేటగిరీని బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్షన్నర వరకు ధరలు తగ్గాయి. ఇక బైక్‌లపైనా రూ.4 వేల నుంచి మొదలుకొని బైక్‌ను బట్టి రూ.15 వేల వరకు ధర తగ్గింది. అయినా కూడా వాహన కొనుగోళ్లపై ప్రజలు ధర తగ్గింపు విషయంలో ఆసక్తి కనబరచలేదు.

జీఎస్టీ తగ్గడానికి ముందే అధికంగా కొనుగోళ్లు

చాలా మంది దసరాకు ముందే వాహనాల కొనుగోలు కోసం అడ్వాన్స్‌లు కట్టి తెప్పించుకున్నారు. దసరా పండుగకు వాహనాలు దొరక్కపోతే ఇబ్బంది అవుతుందని, చాలా మంది రెండు నెలల ముందుగానే బుకింగ్ చేసుకున్నారు. ఈలోగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించింది. అది కూడా బుక్ చేసుకున్న వాహనాలకు వర్తించింది. అయితే జీఎస్టీ తగ్గించిన తరువాత ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు పుంజుకోలేదు. జీఎస్టీ కంటే ముందు 20 రోజుల్లో కొనుగోలు చేసిన వాహనాల కంటే జీఎస్టీ తగ్గింపు అమల్లోకి వచ్చిన తరువాత కొనుగోలు చేసిన వాహనాల సంఖ్య తక్కువగానే ఉంది.

దీపావళికి కొనుగోళ్లు పెరగొచ్చు



సాధారణంగా ఎక్కువ మంది వాహనాలను దసరాకు కొనుగోలు చేస్తారు. దసరా సమయంలో కొనుగోలు చేసే ప్లాన్‌లేని వారు దీపావళికైనా కొనుగోలు చేయాలన్న ఆలోచనతో ఉంటారు. అయితే జీఎస్టీ తగ్గి వాహనాల ధరలు తగ్గినందున ఈ దీపావళికి ఎక్కువ వాహనాలు కొనుగోలు చేయవచ్చు. అయితే వాహన కంపెనీలు ఆశించిన మేర కొనుగోళ్లు ఉంటాయా? లేదా? అన్నది ఇప్పుడే చెప్పలేం.

– వాణి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, నల్లగొండ

తగ్గిన వాహనాల రిజిస్ట్రేషన్లు..

- యాదాద్రి భువనగిరి జిల్లాలో జీఎస్టీ తగ్గకముందు 20 రోజుల్లో 845 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా, జీఎస్టీ తగ్గిన తరువాత 20 రోజుల్లో 686 వాహనాలు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి.
- నల్లగొండ జిల్లాలో గత నెల 1వ తేదీ నుంచి 20వ తేదీలోపు (జీఎస్టీ తగ్గింపునకు ముందు) 1,042 వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. జీఎస్టీ తగ్గింపు తరువాత అంటే గత నెల 22వ తేదీ నుంచి ఈ నెల 10వ తేదీ వరకు 1,038 వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఈ లెక్కన జీఎస్టీ తగ్గకముందు కంటే తగ్గిన తరువాత 4 వాహనాలు తక్కువగానే రిజిస్ట్రేషన్ అయ్యాయి.
- సూర్యాపేట జిల్లాలో జీఎస్టీ తగ్గించకముందు 20 రోజుల్లో 747 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా, జీఎస్టీ తగ్గిన తరువాత ఇరవై రోజుల్లో 667 వాహనాలే రిజిస్ట్రేషన్ అయ్యాయి.

పాటిమట్లలో బునాదిగాని కాల్వ భూసేకరణ సర్వే



సర్వే చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ జగన్నాథరావు

మోత్కూరు : బునాదిగాని కాల్వ భూ సేకరణకుగాను మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామ రెవెన్యూ పరిధిలో మంగళవారం భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జగన్నాథరావు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాటిమట్ల గ్రామంలో 92, 95 తదితర సర్వే నంబర్ల పరిధిలో 17.24 ఎకరాల్లో భూసేకరణ కోసం ప్రాథమిక నివేదిక, కబ్జా, టైటిల్ డీడ్ నిర్ధారణ, పట్టాదారుడి నిర్ధారణ చేసినట్లు ఆయన తెలిపారు. దీని పరిధిలో 50 మందికి పైగా రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నామని పేర్కొన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తులు ఇవ్వాలని, వాటిని జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్ పరిశీలిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కొంత మంది రైతులు గతంలో బృందావన్ కాల్వ కోసం తమ భూములు పోయాయని, తిరిగి బునాదిగాని కాల్వ కోసం తమ భూములు కోల్పోతున్నామని డిప్యూటీ కలెక్టర్‌తో వాదనకు దిగారు. పాత అలైన్‌మెంట్ మేరకే సర్వే చేయాలని పట్టుబట్టారు. ఈమేరకు సుకన్య, మారుపాక భిక్షం, మారుపాక మంగమ్మ, చల్లా రామయ్య, చల్లా యాదయ్య, గొలుసుల ముత్తయ్య, గొలుసుల సోమయ్య, రాణిలతో పాటు 20 మంది రైతులు వినతిపత్రం అందజేశారు. భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంట తహసీల్దార్ జ్యోతి, భూసేకరణ డిప్యూటీ తహసీల్దార్ జయపాల్‌రెడ్డి, ఐబీ ఏఈ తరుణ్, ఆర్‌ఐ సుమన్, సర్వేయర్ ఖాజాఫరిదోద్దీన్, జీపీఓ నర్సింహ, హెచ్‌ఈఓ అరూరు నర్సింహ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎల్లేష్ ఉన్నారు.

పీహెచ్‌సీల తనిఖీ

భువనగిరి, బీబీనగర్ : సెంట్రల్ మెడిసన్స్, ఆరోగ్య కేంద్రాల పరిశీలనలో భాగంగా భువనగిరి మండలంలోని అనంతారం గ్రామంలో గల పల్లె దవాఖానాను మంగళవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టాస్క్‌పోర్స్ టీం సభ్యులు పుట్ల శ్రీనివాస్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యామిని శృతి, డాక్టర్ మురళీ, వీరారెడ్డి, శ్రీనివాస్, పుష్పా, సురేష్‌కుమార్, వసుధ ఉన్నారు. అదేవిధంగా బీబీనగర్ మండలంలోని కొండమడుగు గ్రామంలో గల పీహెచ్‌సీని మంగళవారం రాష్ట్ర డ్రగ్ టాస్క్‌ఫోర్స్ టీం తనిఖీ చేసింది. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డ్రగ్ టాస్క్‌ఫోర్స్ టీం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం సూచించారు.

రోడ్డు ప్రమాదాలు నివారించేలా..

- హైవేలోని జంక్షన్ల వద్ద ప్రమాదాల నియంత్రణపై ఎన్‌హెచ్‌ఏఐ దృష్టి
- రహదారి మధ్యలో చెట్ల ఎత్తును తగ్గిస్తున్న సిబ్బంది
- రోడ్డు హద్దులు తెలిసేలా రేడియంతో కూడిన రోడ్ స్టడ్స్, వైట్ రోడ్ మార్కింగ్



ఆలేరులోని నేషనల్ హైవే జంక్షన్‌లో ఏర్పాటు చేసిన రేడియంతో కూడిన రోడ్ స్టడ్స్



ఆలేరులో రహదారి మధ్యలో మొక్కలను కట్ చేస్తున్న సిబ్బంది

ఆలేరు: హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణపై నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) దృష్టి సారించింది. ముఖ్యంగా హైవేలోని జంక్షన్ల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది. ఈమేరకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు.

గడిచిన మూడు నెలల్లో 15 ప్రమాదాలు.. ముగ్గురు మృతి

ఆలేరులో 11 కి.మీ. హైవే ఉంది. గడిచిన మూడు నెలల్లో ఈ హైవేపై సుమారు 15 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఇందులో ముగ్గురు మృతి చెందగా దాదాపు 20మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

ఇవి కారణాలు

రోడ్డు ప్రమాదాలకు పలు కారణాలను పోలీసులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సంయుక్తంగా గుర్తించారు. రహదారికి మధ్యలో వివిధ రకాల చెట్లు ఎత్తుగా పెరగటంతో జంక్షన్ వద్ద రోడ్డు దాటే సమయంలో వాహనాలు కనిపించక, లేదా వాహనదారులకు రోడ్డు క్రాసింగ్ చేసే వారు సడన్‌గా రావడం వల్ల రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్నట్లు విచారణలో గుర్తించారు. అదేవిధంగా జంక్షన్ల వద్ద విద్యుత్ దీపాలు లేకపోవడం మరో కారణమని అధికారుల దృష్టికి వచ్చింది.

నివారణ చర్యలు

హైవే జంక్షన్ల వద్ద రహదారి మధ్యలో చెట్ల ఎత్తును తగ్గించాలని ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించింది. తద్వారా జంక్షన్ల నుంచి వంద మీటర్ల దూరం వరకు రహదారిపై వాహనాల రాకపోకలను గమనించి, రోడ్డు క్రాస్ చేసే వీలు కలగనుంది. దీంతో ప్రమాదాల నియంత్రణకు ఆస్కారం ఉంది. ఈ ప్రక్రియను అధికారులు మొదలు పెట్టారు. అదేవిధంగా హైవే జంక్షన్ల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసే దిశగా ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాత్రి వేళ జంక్షన్ల వద్ద రోడ్డు క్రాస్ చేసే సమయంలో రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా వాహనాల రాకపోకలను నిశితంగా గమనించే అవకాశం కలుగుతుంది. వాహనదారులను అప్రమత్తం చేసే విధంగా రోడ్డు హద్దులు తెలియడానికి రేడియంతో కూడిన రోడ్ స్టడ్స్, వైట్ రోడ్ మార్కింగ్ పనులు ఎన్‌హెచ్‌ఏఐ చేస్తోంది.

కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

చౌటుప్పల్ రూరల్: హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి హైవే అథారిటీ, రోడ్డు భద్రత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా దండుమల్కాపురం గ్రామంలోకి వెళ్లే కూడలి, బొర్రోల్లగూడెం వద్ద ఉన్న కూడలి విస్తరించేందుకు ఇప్పటికే అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జాతీయ రహదారిపై ఉన్న కైతాపురం, పంతంగి గ్రామాల కూడళ్ల వద్ద తాజాగా హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పనులు ప్రారంభించారు. హైవేపై ఉన్న బ్లాక్‌స్పాట్లలో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు.



ధర్మాజిగూడెం వద్ద కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

అందులో భాగంగా మండలంలోని ధర్మాజిగూడెం స్టేజి వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి.

అధికారులతో చర్చిస్తున్నాం



హైవేపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మాట్లాడాం. వారితో కలిసి ప్రమాదాలకు కొన్ని కారణాలను గుర్తించాం. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రోడ్డు ప్రమాద నివారణ పనులపై దృష్టి పెట్టారు.

– వినయ్, ఆలేరు ఎస్‌ఐ

క్లుప్తంగా

జూబ్లీహిల్స్‌లో లాల్‌సింగ్ నాయక్ నామినేషన్


రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న లాల్‌సింగ్‌నాయక్

త్రిపురారం: త్రిపురారం మండలంలోని లచ్య తండా గ్రామ పంచాయతీకి చెందిన పానుగోతు లాల్‌సింగ్‌నాయక్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు గాను మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. లాల్‌సింగ్‌నాయక్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా.. గతంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలోనూ పలుమార్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నేరేడుచర్ల: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన నేరేడుచర్ల పట్టణంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు రామాపురంలో నివాసముంటున్న శ్రీరాముల వెంకటేష్ తన భార్యతో కలిసి మంగళవారం కూలీ పనులకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత అతడి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. ఇల్లు మొత్తం దగ్ధం కావడంతో సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసయ్య ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ద్విచక్ర వాహనంలో మంటలు

హుజూర్‌నగర్: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగాయి. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ వద్ద మూసి ఉంచిన దుకాణం వద్ద పార్కింగ్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో బైక్ సీటు, ట్యాంక్ భాగం కొంత వరకు కాలిపోయింది. స్థానికులు గమనించి మంటలను ఆర్పారు.

మట్టపల్లిలో నాకాబందీ

మఠంపల్లి: మఠంపల్లి మండలం మట్టపల్లి వద్ద గల అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్‌లో మంగళవారం రాత్రి స్థానిక పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ పి. బాబు మాట్లాడుతూ.. సరిహద్దు నుంచి గంజాయి అక్రమంగా తరలకుండా, నేరాలను అదుపు చేయడంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాఖాబందీ నిర్వహించినట్లు తెలిపారు.

సాగర్ వెనుక జలాల్లో యువకుడి గల్లంతు

చందంపేట: నేరెడుగొమ్ము మండలం వైజాక్ కాలనీ వద్ద సాగర్ వెనుక జలాల్లో మంగళవారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన తిన్నారపు పృథ్వీరాజ్(26) హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. మంగళవారం తన నలుగురు స్నేహితులతో కలిసి వైజాక్ కాలనీకి వచ్చాడు. ఈ క్రమంలో పృథ్వీరాజ్ ఈత కొట్టేందుకు సాగర్ వెనుక జలాల్లోకి దిగి గల్లంతయ్యాడు. అతడి స్నేహితులు గమనించి స్థానికులకు విషయం చెప్పగా గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు గాలించినా పృథ్వీరాజ్ ఆచూకీ తెలియరాలేదని ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపారు.

బౌద్ధం.. జీవన విధానాన్ని తెలిపే మార్గం


బుద్ధవనంలోని ధ్యానమందిరంలో బుద్ధుడి విగ్రహం వద్ద మహేష్ దియోదర్, ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ తదితరులు


బుద్ధుని పాదాల చెంత పుష్పాంజలి ఘటిస్తున్న మహేష్ దియోకర్, ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్, మల్లేపల్లి లక్ష్మయ్య తదితరులు

- పూణే విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మహేష్ దియోకర్
- బుద్ధవనంలో ఘనంగా ధమ్మ విజయ వేడుకలు

నాగార్జునసాగర్: బౌద్ధం ఒక మతం కాదని.. అది జీవన విధానం తెలిపే దమ్మ మార్గమని మహారాష్ట్రలోని సావిత్రిబాయి పూలే పూణే విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మహేష్ దియోకర్ అన్నారు. మంగళవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో ధమ్మ విజయ వేడుకలను బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రొఫెసర్ మహేష్ దియోకర్ హాజరై బుద్ధవనంలోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతర మహాస్థూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్ఞాన జ్యోతిని వెలిగించారు. అనంతరం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బుద్ధుని ధమ్మ చక్ర ప్రవర్తన సారాంశాన్ని విస్తరిస్తూ అశోకుడు బౌద్ధాన్ని స్వీకరించిన రోజును ధమ్మ విజయంగా చెప్పబడుతందన్నారు. ఇదే రోజున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించారని తెలిపారు. బౌద్ధ దమ్మంతో సహోదరతత్వం విరాజిల్లిందన్నారు. ఆనాడు పాలీ భాషలో అనేక ధర్మశాసనాలను ప్రపంచ నలుమూలలకు అశోక చక్రవర్తి విస్తరింపజేసి ప్రపంచమంతటా బుద్ధ ధమ్మ సారాంశాన్ని వ్యాప్తి చేశారని పేర్కొన్నారు. సమాజంలో అసమానతలను రూపుమాపి సమానత్వాన్ని కల్గించడం కోసం బుద్ధ దమ్మమే మార్గమని బీఆర్ అంబేడ్కర్ చాటాడని తెలిపారు. ఇలాంటి మహాత్ములు స్వీకరించిన సద్ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. వీటన్నింటికి బుద్ధవనం కేంద్రంగా నిలుస్తుందని ఆకాంక్షించారు. బుద్ధవనంలో బుద్ధుని బోధనలు తెలియజేసేలా ఒక విద్యా కేంద్రం ఏర్పాటు చేయాలని బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్యకు ఆయన సూచించారు. అనంతరం మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ.. బుద్ధవనం తెలంగాణకు లాండ్‌మార్క్‌గా నిలుస్తుందన్నారు. ప్రశాంతతకు, ధమ్మానికి, జ్ఞానానికి ప్రేరణకు మారుపేరుగా బుద్ధవనం నిలుస్తుందని పేర్కొన్నారు. ఎంజీయూలో బుద్ధిష్ట్ స్టడీస్‌లో సర్టిఫికేషన్ కోర్సు అందించేలా కృషిచేస్తామన్నారు. రాబోయే 15 ఏళ్లో బుద్ధవనం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. బుద్ధవనంలో విద్యా కేంద్రానికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం హైదరాబాద్ రెడ్డి మహిళా కళాశాల కార్యదర్శి ముత్యంరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో బుద్ధవనంలో బౌద్ధ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భవిష్యత్తుకు యువతే ప్రధానమని, బౌద్ధ ధమ్మ ఆవశ్యకతను యువత తెలుసుకోవాలన్నారు. అనంతరం బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. బుద్ధ దమ్మం తెలంగాణలో ఎలా ప్రవేశించిందో వివరించారు. బుద్ధవనాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి జరుగుతుందని, ఇప్పటికే డిజిటల్ మ్యూజియం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీగురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత, బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, నల్ల గొండ జిల్లా టూరిజం అధికారి శివాజీ, బుద్ధవనం ఆర్ట్స్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యామసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


ఘటనా స్థలంలో ప్రమాదానికి కారణమైన గూడ్స్ వాహనం

యాదగిరిగుట్ట రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వాటిపై ప్రయాణిస్తున్న వారు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో అటుగా అతివేగంగా వస్తున్న గూడ్స్ వాహనం కిందపడిన బైక్ పైనుంచి వెళ్లడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేట మండలం బేగంపేట గ్రామానికి చెందిన నీలం నరసింహులు(40) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు మంగళవారం పని నిమిత్తం సడల నర్సింహులు అనే వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై రాజపేట నుంచి ఆలేరు వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి దడిగె రాములు, మరో ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై ఆలేరు నుంచి రాజపేట వైపు వెళ్తున్నారు. ఈ రెండు ద్విచక్ర వాహనాలు కాచారం గ్రామ పరిధిలోని పౌల్ట్రీఫాం వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో వారు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో ఆలేరు వైపు వెళ్తున్న గూడ్స్ వాహనం అతివేగంతో నీలం నరసింహులు ద్విచక్ర వాహనం పైనుంచి వెళ్లింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి సడల నరసింహులు కాలు విరిగింది. మరో బైక్‌పై ఉన్న రాములుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు నీలం నరసింహులు భార్య నీల సిద్ధమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ తెలియజేశారు.

బైక్ అదుపుతప్పి మృతి


రాజు (ఫైల్)

అడ్డగూడూరు: బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి కింద పడి మృతిచెందాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన కుంభం రాజు(29) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తన బావమరిది పెళ్లి ఉండటంతో స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం బైక్‌పై యాదాద్రి భువనగిరి జిల్లా పగిడిపల్లి గ్రామంలో తన స్నేహితుడి అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి సాయంత్రం స్వగ్రామానికి వెళ్తుండగా.. అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోలబంక్ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పడంతో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన లారీలు

- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

వేములపల్లి: స్కూల్ బస్సును రెండు లారీలు ఢీకొట్టాయి. ఈ ఘటన నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై వేములపల్లి మండలం శెట్టిపాలెం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని ఆదిత్య పాఠశాలకు చెందిన బస్సులో విద్యార్థులను తీసుకొచ్చేందుకు రోజుమాదిరిగానే మంగళవారం ఉదయం డ్రైవర్ పెదమాం గిరిబాబు వేములపల్లి మండలం శెట్టిపాలెంకు బయల్దేరాడు. ఈ క్రమంలో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై శెట్టిపాలెం క్రాస్ రోడ్డు వద్ద యూటర్న్ తీసుకుంటుండగా.. వేములపల్లి నుంచి మిర్యాలగూడ వైపు లారీ వస్తుండడం గమనించి డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. అదే సమయంలో మిర్యాలగూడ వైపు నుంచి వస్తున్న కంటెయినర్ ఒక్కసారిగా వెనుక నుంచి బస్సును ఢీకొట్టడంతో బస్సు ముందుకు వెళ్లగా.. మిర్యాలగూడ వైపు వస్తున్న లారీ బస్సును ముందు వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ గిరిబాబు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. లారీ డ్రైవర్ ఆనంద్ నామ్‌దేవ్ మొలేకర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు బస్సు డ్రైవర్, లారీ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం రహదారిపై స్కూల్ బస్సును, లారీలను పోలీసులు క్రేన్ల సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఘటన జరిగిన సమయంలో స్కూల్ బస్సులో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు డ్రైవర్ గిరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపారు.

వరి ధాన్యం దొంగిలిస్తున్న ఇద్దరి అరెస్ట్

కేతేపల్లి: రైతులు రోడ్డు వెంట ఆరబోసిన వరి ధాన్యాన్ని అపహరించిన ఇద్దరు దొంగలను మంగళవారం కేతేపల్లి పోలీసులు పట్టుకుని రిమాండ్ చేశారు. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్లు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బచ్చలకూరి మహేష్, పెయింటర్‌గా పనిచేస్తున్న గుర్రాల రమేష్ ముఠాగా ఏర్పడి పలు ప్రాంతాల్లో వరి ధాన్యాన్ని దొంగిలించి విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఈ క్రమంలో కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం, ఉప్పలపహాడ్ గ్రామాల్లో రోడ్డు వెంట రైతులు ఆరబోసిన వానాకాలం వరి ధాన్యాన్ని గత కొన్నిరోజుల నుంచి చోరీ చేస్తూ మహేష్‌కి చెందిన ఆటోలో తరలించి అమ్ముకుంటున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కేతేపల్లి పోలీసులు రాత్రి వేళ రోడ్లపై నిఘా పెంచారు. మంగళవారం ఎస్‌ఐ సతీష్ తన సిబ్బందితో కలిసి చీకటిగూడెం శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా రమేష్, మహేష్ ఆటోలో వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వరి ధాన్యం దొంగతనం చేస్తున్నట్లు నిజం ఒప్పుకున్నారు. నిందితులను నకిరేకల్ కోర్టులో రిమాండ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



శివశంకర్ (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామ శివారులో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామానికి చెందిన మేడబోయిన శివశంకర్(31) సూర్యాపేటలోని సుధాకర్ పీవీసీ కంపెనీలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 11న ఇంట్లోంచి బయటకు వెళ్లిన శివ తిరిగి ఇంటికి చేరుకోలేదు. తల్లిదండ్రులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో చివ్వెంల మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ పక్కన కుళ్లిపోయి ఉన్న మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ కనకరత్నం తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు సహాయంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి యల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు అవివాహితుడు.

బెదిరింపులకు మనస్తాపం చెంది యువకుడి ఆత్మహత్య

అనంతగిరి: చంపుతానని బెదిరించడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అనంతగిరి మండలం ఖానాపురం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం పోలీసులు, మృతుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపురం గ్రామానికి చెందిన బొడ్డు వెంకటేశ్(27) కోదాడ మండలం తొగార్రాయి గ్రామానికి చెందిన ఓ మహిళకు చెందిన ఆటోకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో సదరు ఆటో యజమానురాలితో గుడిబండ గ్రామానికి చెందిన కొండ గోపి సన్నిహితంగా ఉండేవాడు. అయితే ప్రస్తుతం ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న బొడ్డు వెంకటేశ్, సదరు ఆటో యజమానురాలు సన్నిహితంగా ఉంటున్నారనే అనుమానం కొండ గోపికి వచ్చింది. దీంతో సోమవారం రాత్రి 8గంటల సమయంలో కోదాడలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న వెంకటేశ్ వద్దకు వచ్చిన గోపి వచ్చి గొడవకు దిగి కొట్టాడు. మంగళవారం ఉదయం వరకు నా చేతిలో ఘోరమైన చావు చస్తావంటూ వెంకటేశ్‌ను గోపి బెదిరించి అతడి సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లిపోయాడు. దీంతో భయాందోళనకు గురైన వెంకటేశ్ ఇంటికి వచ్చి పైకప్పుకు ఉన్న ఐరన్ రాడ్డుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కొండ గోపిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి ఎస్‌ఐ ఎం. నవీన్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

నాలుగు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల


మూసీ ప్రాజెక్టు నుంచి దిగువకుపోతున్న నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 8,598 క్యూసెక్కుల వరద వస్తుండగా.. ప్రాజెక్టు అధికారులు నాలుగు క్రస్ట్ గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 8,579 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ కాల్వలకు 340 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ట స్థాయి నీటి మట్టం 645 అడుగులు కాగా.. ప్రస్తుతం 644 అడుగుల వద్ద నీటిమట్టం నిలకడగా ఉంచి ఎగువ నుంచి వచ్చే వరదను దిగువకు విడుదల చేస్తున్నామని ప్రాజెక్ట అధికారులు పేర్కొన్నారు. 4.46 టీఎంసీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టులో ప్రస్తుతం 4.27 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

టెక్స్‌టైల్ పార్కులో దేవాలయాల కండువాల తయారీ

- చేనేత, జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్‌వీ రావు


అపెరల్ టెక్స్‌టైల్ పార్కులో వస్త్రాలను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ ఎన్‌వీ రావు

చౌటుప్పల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాలకు సరఫరా చేసేందుకు గాను చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రామంలోని అపెరల్ టెక్స్‌టైల్ పార్కులో మర మగ్గాలపై టీజీఎస్‌కో ద్వారా కండువాలు తయారు చేయిస్తున్నామని చేనేత, జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్‌వీ రావు తెలిపారు. మంగళవారం ఆయన టెక్స్‌టైల్ పార్కుని సందర్శించి అక్కడ తయారవుతున్న వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. కళాకారిణి రజిమ కళాకండాలతో పాటు కళాకారుడు శ్రావణ్ వెదురుతో తయారుచేసిన ఉత్పత్తులు, హస్త కళాకారుడు కె. కృష్ణమూర్తి ప్రాచీణ బాతిక్, స్క్రీన్, బ్లాక్, టై అండ్ డై పద్ధతులను నవీకరించి తయారుచేసిన వస్త్రాలను పరిశీలించారు. అపెరల్ టెక్స్‌టైల్ పార్కు నిర్వహణ బాధ్యతలను టీజీఐఐసీకి అప్పగించాలని కోరుతూ పార్కు కమిటీ అధ్యక్షుడు ఎంకేడీ ప్రసాద్ ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, ఐఐహెచ్‌టీ సహాయ ప్రిన్సిపాల్ కుమార్, సలహాదారు కోప్రసాచారి, చేనేత ఏడీ శ్రీనివాసరావు, అభివృద్ధి అధికారి బాలమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ పోటీలు


భువనగిరి: బాలుర విభాగంలో గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఈఓ సత్యనారాయణ


హుజూర్‌నగర్: కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ చరమందరాజు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కిరణ్‌కుమార్

భువనగిరి: భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) వాలీబాల్ పోటీలు(అండర్ –17 బాలబాలికలు)ను యాదాద్రి భువనగిరి జిల్లా డీఈఓ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో యాదాద్రి భువనగిరి జిల్లా మొదటి స్థానంలో, నల్లగొండ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో సూర్యాపేట జిల్లా, ద్వితీయ స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా జట్లు నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దశరథరెడ్డి, టీజీపీఈటీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ. మల్లేశం, టి. చంద్రశేఖర్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, జిల్లా పీఆర్‌టీయూ కార్యదర్శి మధుసూదన్, వెంకట్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో కబడ్డీ పోటీలు..

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని క్యాంప్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలను(అండర్–14, 17 బాలబాలికలు) సీఐ చరమంద రాజు, ఎస్‌జీఎఫ్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ పోటీల్లో అండర్–17 బాలుర విభాగంలో ప్రథమ బహుమతి నల్లగొండ జిల్లా, ద్వితీయ బహుమతి సూర్యాపేట జిల్లా, బాలికల విభాగంలో ప్రథమ బహుమతి నల్లగొండ జిల్లా, ద్వితీయ బహుమతి సూర్యాపేట జిల్లా జట్లు గెలుపొందాయి. అండర్–14 బాలుర విభాగంలో ప్రథమ బహుమతి నల్లగొండ జిల్లా, ద్వితీయ బహుమతి సూర్యాపేట జిల్లా, బాలికల విభాగంలో ప్రథమ బహుమతి నల్లగొండ జిల్లా, ద్వితీయ బహుమతి సూర్యాపేట జిల్లా జట్లు గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అండర్–14 బాలబాలికల జిల్లా జట్లు ఈ నెల 16 నుంచి 18 వరకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అదేవిధంగా అండర్–17 బాలబాలికల జట్లకు రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడా పోటీల తేదీలు ప్రకటించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం జాని, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దొంతగాని శ్రీనివాస్ గౌడ్, కోతి సంపత్‌రెడ్డి, క్రీడాకారులు సుధాకర్‌రెడ్డి, పోతురాజు రమేష్, వెంకటరత్నం, నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జి దేవిశెట్టి రవి, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన యువ దర్శకుడు

- తెలంగాణ ప్రజాపాలనపై షార్ట్ ఫిల్మ్ రూపొందించిన చిన్నకందుకూర్ వాసి
- బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్–2025లో సెలక్షన్ లిస్టులో చోటు


ప్రజాపాలనపై చిన్నకందుకూర్ గ్రామంలో షార్ట్ ఫిల్మ్ తీస్తున్న నమిలే శివకుమార్ (ఫైల్)

యాదగిరిగుట్ట: బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్–2025 సెలక్షన్ లిస్టులో యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూర్ గ్రామానికి చెందిన యువ దర్శకుడు నమిలే శివకుమార్ రూపొందించిన ప్రజాపాలన అనే షార్ట్ ఫిల్మ్‌కు చోటు దక్కింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రభుత్వ పాలనా విధానాలు ఎలా ప్రతిబింబిస్తున్నాయనే అంశాన్ని వాస్తవికంగా చూపించేలా షార్ట్ ఫిల్మ్ చేయడంతో తనకు 'బతుకమ్మ యంగ్ ఫిలిమ్స్ మేకర్స్ ఛాలెంజ్–2025' సెలక్షన్ లిస్టులో చోటు దక్కినట్లు యువ దర్శకుడు నమిలే శివకుమార్ తెలిపారు. తెలంగాణ ప్రజాపాలనపై 2 నిమిషాల 58 సెకన్ల పాటు రూపొందించిన వీడియోను బతుకమ్మ యంగ్ మేకర్స్ ఛాలెంజ్–2025కు ఈ నెల 4న పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే ఈ నెల 9న హైదరాబాద్‌లోని శిల్పారామంలో అవార్డు ఫంక్షన్ నిర్వహించాల్సి ఉండగా.. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ఉండటంతో వాయిదా పడిందని, త్వరలోనే ప్రభుత్వం అవార్డు ఫంక్షన్ నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 500కు పైగా షార్ట్ ఫిల్మ్‌లు, పాటలు వచ్చాయని, వీటిని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, ఫెస్టివల్ టీమ్ ఆధ్వర్యంలో పరిశీలించి సెలక్షన్ లిస్టు తయారు చేశారన్నారు.

పొలం గట్లపై కూరగాయల సాగు


వరి పొలం గట్లపై రైతు కనకయ్య సాగుచేసిన బెండ

నడిగూడెం: నడిగూడెం మండల పరిధిలోని బృందావనపురం గ్రామానికి చెందిన రైతు పుట్ట కనకయ్య వినూత్నంగా వరి పొలం గట్లపై పలు రకాల కూరగాయలు సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. సాధారణంగా వరి పొలం గట్లపై గడ్డి పెరుగుతుండడంతో దానిపై కలుపు మందుల పిచికారీ చేయడం లేదా గడ్డిని కోయడం జరుగుతుంది. కానీ అందుకు భిన్నంగా పచ్చని పొలాల మధ్య ఉన్న పొలం గట్లు ఖాళీగా ఉండడంతో తన కుటుంబ అవసరాల కోసం బెండ, గోంగూర, దోస, కాకర సాగు చేస్తున్నాడు. గట్లపై కూరగాయలు సాగు చేస్తుండడంతో వరికి చీడపీడల బెడద కూడా తగ్గిందని రైతు కనకయ్య చెబుతున్నాడు. అలాగే గట్లపై సాగు చేసిన కూరగాయలకు ఎలాంటి రసాయన మందులు వాడకుండానే సాగు చేస్తున్నాడు. దీంతో రహదారి మీదుగా వెళ్తున్న ప్రయాణికులు గట్లపై కూరగాయల సాగును ఆసక్తిగా గమనిస్తున్నారు.